

Mobile No.: 9347034033
040-24241061

# SRI RAMA VISWAMBHARADAS (JATALA SADHU) ADHYATHMIKA SEVA SANGAM

(Regd.No.491/2009, dt.08.06.09)
Office: H.No.C-383, Sector III, Sachivalaya Nagar, Vanasthalipuram, Hyderabad-70.

ఓం శ్రీ గణేశాయనమః

## విజ్ఞప్తి

సువిశాల భారతంలో అనాదిగా వేలాది మంది యుగపురుషులు అవతరించారు. పుణ్యభూమి, కర్మభూమి, జ్ఞానభూమి అయిన ఈ నేల సనాతన ధర్మానికి, సంస్కృతీ సాంప్రదాయాలకు ఆలవాలమైనది. యుగపురుషులెందరో ఆయా ధర్మాలను ఆచరించి, సాధారణ జనులకు మార్గదర్శకులై చిరస్మరణీయులైనారు. ఇలాంటి ఎందరో మహనీయుల జన్మస్థలియైన ఈ వేద భూమిలో వందల సంవత్సరాల పాటు మనమధ్యలోనే భౌతికముగా సశరీరులై ఉన్న యోగులు చాలా అరుదుగా ఉన్నారు. అలాంటి వారిలో సుమారు 440 సం॥లు పాటు మానవదేహంతో నివసించిన ఒక మహా సాధువు గురించిన వివరాలు తెలుసుకొంటే ఆశ్చర్యము కలగక మానదు. దాదాపు 15 సంవత్సరాల క్రితం వరకు మన మధ్యలోనే అదికూడా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని సుప్రసిద్ధ సింహాచల పవిత్ర క్షేత్రంలో బస చేసిన సిద్ధ పురుషుని గురించి తెలుసుకోవలసిన అవసరం. ఆధ్యాత్మిక చింతన కలిగిన ప్రతి వ్యక్తికి ఉన్నదని చెప్పడం ఎంత మాత్రం అతిశయోక్తి కాదు.

శతాబ్దాల తరబడి దైవ నామ స్మరణతో వేలాదిమందికి భగవత్ స్వరూపుడిగా, మార్గదర్శకులుగా నిలిచిన ఆయనే మహా తపస్వి శ్రీశ్రీశ్రీ రామ విశ్వంభర దాస్ (జటల సాధు). ప్రచార పటాటోపాలకు దూరంగా నిత్యం గాయిత్రి నామ స్మరణతో ఉండే ఈ స్వామీజీ సిద్ధి పొందిన తరువాత కూడా ఉనికిని చాటుతూ ఉన్న సిద్ధ పురుషుని స్మృత్యాలయం నేటికీ సింహాచల కొండపైనే ఉన్నది.

తనను దర్శించిన భక్తులకు ప్రసాదంగా గాయిత్రీ హోమం తాలూకు యిచ్చే భస్మము, భూతప్రేత, పిశాచాల ప్రయోగాలకు విరుగుడుగా ఉపయోగపడేది. కొన్నిసార్లు చిత్తు కాగితాలను చింపి వాటినే రక్షలుగా స్వామీజీ అందించేవారు. అవి ఆ భక్తుల అభీష్టం మేరకు ఉపయోగపడేవి. ఆయనను కొలిచే భక్తుల పూజా మందిరాలలో ఇప్పటికీ ఇలాంటి రక్షలు ఉన్నాయంటే వాటి మహిమ ఏపాటిదో తేటతెల్లం అవుతుంది.

తాను, షిర్డీ సాయిబాబా వారు హుక్కా సేవించినట్లు స్వామివారు స్వయంగా భక్త జనులకు తెలియజేసారు. అలాగే వీరనారి, రాణి ఝాన్సీ లక్ష్మీబాయి స్వామీజీ ఆశీర్వాదం పొందినట్లు చెబుతారు. బొబ్బిలి యుద్ధం కాలంనాటి సన్నివేశాలను ఆయన స్వయంగా వీక్షించినట్లు తన అంతరంగిక భక్తులకు తెలియపరిచారు. అంతే కాకుండా మాజీ రాష్ట్రపతి శ్రీ జ్ఞాని జైల్‌సింగ్ ప్రత్యేకంగా స్వామి వారి వద్దకు వచ్చి దర్శనం చేసుకొన్నారు. మాజీ రాష్ట్రపతి శ్రీ వి.వి.గిరి., మాజీ ముఖ్యమంత్రి శ్రీ మర్రి చెన్నారెడ్డి వంటి ప్రముఖులెందరో స్వామి వారి ఆశీర్వచనం తీసుకొన్న వారిలో ఉన్నారు. అసంఖ్యాకుల్లో ఆధ్యాత్మిక సేవాభావాన్ని పెంపొందిన కులపతి ఎక్కిరాల కృష్ణమాచార్యుల వారుకూడా స్వామి వారిని సేవించారు.

# మియాపూర్‌లో గురుజ్ఞానకేంద్రం

భారతీయ సమాజంలో యుగయుగాలుగా అనేక మంది మహనీయులు అవతరించారు. అందులో కొద్ది మంది ప్రముఖ యోగుల వివరాలను విస్తృత జనావళికి అందించేలా, ఒక గురు జ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సంకల్పించాము. సింహాచల ప్రాంతంలో ప్రసిద్ధి పొందిన శ్రీ స్వామి విశ్వంభర దాస్ పేరిట ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని హైదరాబాద్ మియాపూర్‌లోని శ్రీ ధర్మపురి క్షేత్రంలో నెలకొల్పనున్నాము. ఈ క్షేత్రం ఈ పాటికే పలు దేవాలయాలు, ఆశ్రమాలతో ఆధ్యాత్మిక కేంద్రంగా రూపొందింది. అదే కోవలో ప్రముఖ యోగుల జీవిత విశేషాలతో ఒక గురుజ్ఞానకేంద్రాన్ని కూడా ఏర్పాటు చేయడం ద్వారా ప్రాంగణానికి మరింత భక్తి శోభను కల్పించ తలపెట్టాము. మహిమాన్వితులై అసంఖ్యాక భక్తుల నిత్య నీరాజనాలందుకొంటున్న యోగుల జీవిత విశేషాలను ఒక వేదికపై నుంచి అశేష జనావళికి తెలియజేయాలనే లక్ష్యంతో ఈ కేంద్రం ఏర్పాటునకు శ్రీకారం చుట్టాము.

అనేక యుగాల చరిత్రలో యోగులు, స్వాములు, బాబాలు వంటివారెందరో ఈ దేశంలో అవతరించారు. ఇలాంటి మహనీయుల గురించి ఆయా ప్రాంతాల వారికే కాకుండా, ఒక వేదిక నుంచి అందరికీ తెలియజేయడం ద్వారా ప్రజల్లో మరింతగా భక్తిప్రపత్తులు పెరిగేందుకు దోహదం చేయవచ్చున్న యోచనతో శ్రీ ధర్మపురిలో గాయిత్రీ ఆశ్రమం పేరిట కేంద్రాన్ని నిర్మించతలపెట్టాము.

దీని నిర్మాణ పనులు పూర్తి అయిన పిదప విశ్వ శ్రేయస్సుకు దోహదపడే నిత్య గాయిత్రీ హోమం నిర్వహించాలని సంకల్పించాము. శతాబ్దాల పాటు భక్త జనులకు ఆశ్రయమిచ్చి తరింప జేసిన జటల సాధు బాబు గురించే కాకుండా అనేక మంది యోగి పుంగవుల గురించి కూడా నేటి తరాలకు వివరించాలనీ, మరింత విశేషంగా పలు సేవా కార్యక్రమాలు చేపట్టాలనే సంకల్పంతో కొంత మంది భక్తులతో ఒక సంఘాన్ని నెలకొల్పాము.

ఉదాత్తమైన భావాలతో, సత్‌సంకల్పంతో చేపట్టిన ఈ బృహత్ కార్యక్రమానికి మీ వంతు చేయూతను అందించి భగవత్ స్వరూపులైన శ్రీశ్రీశ్రీ రామ విశ్వంభర దాస్ (జటల సాధు) కృపకు పాత్రులు కాగలరని ఆకాంక్షిస్తున్నాము.

సర్వేజనా సుఖినోభవంతు

భక్త బృందం

శ్రీ రామ విశ్వంభర దాస్ (జటల సాధు)

ఆధ్యాత్మిక సేవా సంఘం, హైదరాబాద్.

హైదరాబాద్

తేది : 08-06-2009